# శీలసంపత్తిని చేకూర్చునదే నిజమైన విద్య

ప్రేమస్వరూపులారా! మానవుడు ఎంత చదువు చదివినప్పటికీ ఆ చదువు సమాజానికి ఉపయోగపడకపోతే, అసలు అది చదువే కాదు. చదువు చదివినంత మాత్రమున చాలదు, జ్ఞానసిద్ధిని పొందాలి. అంతేకాదు సమస్త సద్గుణములను పోషించుకోవాలి. సద్గుణములచేత, జ్ఞానముచేత జగత్తుకు ఆనందాన్ని అందించాలి. నైతిక, ఆధ్యాత్మిక, శీలసంపత్తిని పెంపొందించునదే నిజమైన విద్య. కేవలం దేహమును పోషించుకుటే చాలదు, హృదయాన్ని విశాలం గావించుకోవాలి. ఇదే చదువుయొక్క ముఖ్యోద్దేశం. మానవుణ్ణి ఆదర్శమానవునిగా, గుణవంతునిగా తీర్చిదిద్దునదే విద్య.

ఆలోచించగల ప్రతి మానవుణ్ణి అయోమయస్థితిలో ముంచెత్తే సమస్యలు ఈనాడు విద్యారంగంలో పెరిగిపోతున్నవి. ఈనాటి మానవుడు అనంతమైన వైజ్ఞానిక సంపత్తిని సాధించాడు. అయితే అంతమాత్రమున తాను గొప్ప విద్యావంతుడనని గర్వించరాదు. విజ్ఞానశాస్త్రం కేవలం లౌకికవిద్యను మాత్రమే బోధిస్తున్నది. మానవునికి ముఖ్యంగా అవసరమైనది గుణశీలత. లౌకికవిద్యను అభ్యసించినంత మాత్రాన మానవుడు గుణశీలుడు కాలేడు. సద్గుణాలను పోషించుకొని సమాజానికి ఆదర్శమునందించే విద్యార్థియే నిజమైన విద్యా శ్రేష్ఠుడని చెప్పవచ్చు. ఈనాటి మానవుడు అన్నీ తెలుసుకుంటున్నాడుకాని, తానెవరో తెలుసుకోలేకపోతున్నాడు. దీనినే ఒకానొక సమయంలో చర్చిల్ కూడా చెప్పాడు - Man has conquered all but he has not conquered himself. తానెవరో తెలుసుకోవటమే పాజిటివ్. జగత్సంబంధమైన విషయాలను గుర్తించటం నెగెటివ్. చదివిన చదువును ఆచరణలో పెట్టక, అన్యులకు ఆదర్శమునందించక, డిగ్రీని చేతిలో పట్టుకొని ఉద్యోగంకోసం ప్రాకులాడటం విద్యావంతుని లక్షణం కాదు.

srisathyasaivachanamrutam

**సకల విద్యలు నేర్చి సభ జయించగవచ్చు**
**శూరులై రణమున పోరవచ్చు**
**రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు**
**హేమగోదానముల్ చేయవచ్చు**
**గగనంపు చుక్కలు గణియింపగా వచ్చు**
**జీవరాసుల పేర్లు చెప్పవచ్చు**
**అష్టాంగ విద్యల నన్ని నేర్వగవచ్చు**
**చంద్రమండల యాత్ర సలుపవచ్చు**
**కాని దేహేంద్రియాదుల నరికట్టి**
**మనసు నిల్పియు నంతర్ముఖమ్ము చేసి**
**అనవరత నిశ్చలమ్మైన ఆత్మలగుచు**
**నిలువగాలేరు మానవుల్ నియతితోడ.**

మానవుడు చంద్రమండలం వెళ్ళటానికి దారి కనుక్కున్నాడుగాని, తన అంతరాత్మకు వెళ్ళటానికి అరయించైనా దారి తెలుసుకోవటంలేదు. తనలో ఉన్న సత్యతత్త్వాన్ని గుర్తించినవాడే నిజమైన విద్యావంతుడు. రాముడు చదివిన చదువు రావణుడు కూడా చదివాడు. కాని రామాయణాన్ని రచించిన వాల్మీకి ఏమన్నాడు? రావణుడు వట్టి మూర్ఖుడు, రాముడు మహాజ్ఞాని అన్నాడు. ఎందుచేత? రాముడు తన చదువును ఆచరణలో పెట్టి, ఇతరులకు ఆదర్శాన్నందించి, లోకక్షేమం కోసం పాటుపడ్డాడు. కాని, రావణుడు తన చదువును ఆచరణలో పెట్టక, ఇంద్రియాలకు దాసుడై తనను, తన సర్వస్వాన్నీ భస్మం గావించుకున్నాడు. మనం చదివే చదువులు ఇంద్రియ సుఖాలను అనుభవించే నిమిత్తం కాదు. ఇంద్రియాతీతమైన శీలతత్త్వమును జగత్తుకు ఆదర్శంగా అందించాలి. కాని ఈనాటి విద్యార్థులు అపవిత్రమైన భావములతో తమ చదువును దుర్వినియోగం చేసుకుంటున్నారు.

సత్యనిత్య సుకృతులెల్ల వికృతి రూపు పొందుచుండె
పవిత్ర ప్రకృతి ప్రతిదినము ప్రజల వీడి పోవుచుండె

sri sathyasai vachanamrutam

ధర్మదయాచరణ సతము వికృతిరూపు నొందుచుండె
ఆర్యవేద విద్యలణగె దుర్విద్యలు పెరుగుచుండె

ఇవన్నీ రోగమును ఇంకా బలపరుస్తాయేగాని, రోగమును నివారించే ఔషధములు కావు.

**విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్పి**
**సంకుచిత భావములనెల్ల సమయచేసి**
**ఐకమత్యము సహజీవనాదికములు**
**సమత నేర్పుటయె కాదె సరస విద్య**

ఇలాంటి విద్యను నేర్చి దేశానికి ఉపకారం చేయాలి. చాలామంది తాము దేశానికి ఉపకారం చేస్తున్నామని, సేవలు సల్పుతున్నామని అంటున్నారుగాని, ఇంద్రియములకు దాసులై స్వార్థస్వప్రయోజనములకే తమ జీవితాన్ని అంకితం గావిస్తున్నారు. మానవునియందు కాలినుండి తల వరకు స్వార్థం తాండవమాడు తున్నది. ఇంద్రియాలను తన వశం గావించుకొన్నవాడే నిజమైన విద్యాశ్రేష్ఠుడు. కాని, నేటి విద్యార్థి తన మనస్సుకు తోచినట్లు ప్రవర్తిస్తున్నాడు. విద్యార్థికి ఉండవలసిన లక్షణము లెలాంటివో మీరు యోచించాలి. “సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనంబు నేర్పునదె విద్య; విద్యార్థి నేర్వవలయు” హృదయం చాలా పరిశుద్ధమైనది. అలాంటి హృదయంలో కరుణ, ప్రేమలను తప్ప మరొకదానిని ప్రవేశపెట్టుకోకూడదు. కాని, ఈనాటి మానవుని హృదయంలో కరుణ, ప్రేమలు లేకపోవటంచేత అనేక నెగెటివ్ భావాలు ప్రవేశిస్తున్నాయి. కనుకనే, ప్రపంచంలో అన్నీ నెగెటివ్ దృశ్యములే కనిపిస్తున్నాయి. మీ హృదయంలో నిండిన భావములే మీకు బయట ప్రతిబింబిస్తున్నాయి.

**పుస్తకజ్ఞానం కాదు, అనుభవజ్ఞానం ప్రధానం**

విజ్ఞానశాస్త్రముగాని, ఆధ్యాత్మికముగాని మనకు ప్రధానంగా అణుతత్త్వాన్నే బోధిస్తున్నాయి. అణువును గురించి చెప్పటంలో ఉన్న అంతరార్థ మేమిటి? మనం తినే తిండి, పీల్చే గాలి, త్రాగే నీరు, వినే శబ్దము, నడిచే నడక అంతా అణుమయమే. అణువుకంటే సూక్ష్మమైన పరమాణుతత్త్వాన్ని మనం గుర్తించాలి.

srisathyasaivachanamrutam

**సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు**
**మేటి వస్తువునందున మేటి యగుచు**
**అంతటను సర్వసాక్షియై యలరునట్టి**
**ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మయే ఆత్మయగును**

ప్రతి పదార్థమూ అణువులయొక్క చేరికయే. ఇక్కడొక పుష్పమున్నది. అనేక అణువుల చేరిక చేతనే ఇదొక పుష్పంగా తయారైంది. ఈ ప్రపంచంలో అణు మయం కాని పదార్థం కనిపించదు. సర్వమూ అణుమయమే. పుట్టుట, గిట్టుట, జీవించుట, సంసారము, భవబంధములు అన్నీ అణుతత్త్వంపైననే ఆధారపడియున్నవి. అదే ఆత్మతత్త్వం. అటువంటి తత్త్వాన్ని గుర్తించాలంటే లౌకికమైన చదువులతోపాటు ఆధ్యాత్మికవిద్యను నేర్చుకోవాలి. ఈనాడు మీరు చదివే చదువులన్నీ కేవలం 'బుకిష్ నాలెడ్జ్'కి (పుస్తకజ్ఞానమునకు) సంబంధించినవి. పుస్తకజ్ఞానం కాదు మనకు కావలసింది, 'ప్రాక్టికల్ నాలెడ్జ్' (అనుభవజ్ఞానం) కావాలి. అణుతత్త్వాన్ని గుర్తించి, దాన్ని ఆచరణలో పెట్టి ఆనందాన్ని అనుభవించాలి. జిలేబీ, లడ్డూ, మిఠాయి అని గ్రంథాల్లో చదివినంత మాత్రమున వాటి మాధుర్యం మీకు తెలుస్తుందా? ఒక్కతూరి నాలుకపై వేసుకొని రుచి చూసినప్పుడే వాటి మాధుర్యం అనుభవానికి వస్తుంది. అదే 'ప్రాక్టికల్ నాలెడ్జ్' (అనుభవజ్ఞానం). మీరు నేర్చిన విద్యను ఆచరణలో పెట్టి ఆనందాన్ని అనుభవించాలి.

**సమాజానికి ఉపకరించని విద్య నిరర్థకం**

మన దేశంలో ఎంతోమంది గొప్ప విద్యావంతులున్నారు. కాని, వారు దేశానికి చేస్తున్న ఉపకారమేమిటి? పదిమందికి ఆనందం కల్గించే పనులేమైనా చేస్తున్నారా? ఏమాత్రం చేయటం లేదు. పరులను సుఖపెట్టటం లేదు, తామూ సుఖపడటం లేదు. ఇంక ఎందుకీ చదువులు?

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**మదిని తన్నెఱుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతినున్నను**
**హీను డవగుణంబు మానలేడు**

**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**

sri sathyasai vachanamrutam

**పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు**
**చదువులన్ని చదివి చావంగనేటికి?**
**చావు లేని చదువు చదవవలయు**

హృదయానికి ఆనందం కల్గించే చదువులు చదవాలి. పదిమందిని ఆనందింపజేసే చదువులు చదవాలి. సమాజంలో బాధలు పడేవారు కోట్లాది మంది ఉన్నారు. వారిలో ఏ ఒక్కరినైనా ఆనందింపజేయటానికి మీరు ప్రయత్నిస్తున్నారా? మీరూ ఆనందించక, ఇతరులనూ ఆనందింపజేయకపోతే మీరు చదివిన చదువువలన ప్రయోజనమేమిటి? డిగ్రీలు చూస్తే గొప్పగా ఉంటున్నాయి. ఒక్కొక్కరు M.Sc., MBA, Ph.D. డిగ్రీలు తీసుకుంటున్నారు. కాని, ఈ డిగ్రీలను సమాజ సంక్షేమంకోసం ఏకించిత్తైనా ఉపయోగ పెడుతున్నారా? లేదు. పుస్తకాల్లో ఉన్నది కంఠస్థం చేసుకొని పరీక్షహాలుకు పోయి తలను ఖాళీ చేసుకొని బయటికి వస్తున్నారు. ఇంతేగాని, అసలు చదువంటే ఏమిటి? ఈ చదువువల్ల తమకు, సమాజానికి కల్గుతున్న ఉపకారమేమిటి? విద్యావంతునికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి? అని ఎవ్వరూ విచారణ చేయటం లేదు. విద్యార్థులు మంచివారేగాని, వారికి సరియైనరీతిలో బోధించేవారు లేకపోవటంచేతనే పెడమార్గం పడుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రులైనా బోధించాలి, లేక పాఠశాలలో అధ్యాపకులైనా బోధించాలి. తల్లిదండ్రులు విద్యావంతులు కాకపోవచ్చు. కాని, విద్యావంతులైన అధ్యాపకులు కూడా కేవలం హోదా కోసం ప్రాకులాడుతున్నారేగాని, పిల్లల్లో పవిత్రతను అభివృద్ధి చేయటానికి ఏమాత్రం పాటుపడటం లేదు.

**విద్యకు వినయమే భూషణం**

పూర్వం బెంగాల్‌లో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ అనే గొప్ప పండితుడుండే వాడు. అతను పేరుకు తగినట్లు విద్యాసాగరుడే. బీదకుటుంబంలో జన్మించినప్పటికీ కష్టపడి చదివి అభివృద్ధికి వచ్చాడు. చదువుకోవటానికి ఇంట్లో దీపం కూడా ఉండేది కాదు. రాత్రిపూట వీధిదీపాల వెలుతురులో కూర్చుని చదువుకునేవాడు. కుమారుడు పడుతున్న కష్టాన్ని చూసి తల్లి చాలా బాధపడేది. అప్పుడు విద్యాసాగర్ "అమ్మా! 'నసుఖాత్ లభ్యతే సుఖం', సుఖమునుండి సుఖము లభించదు. కష్టపడినప్పుడే సుఖం లభిస్తుంది" అని చెప్పి ఆమెను సమాధానపరచేవాడు.

srisathyasaivachanamrutam

క్రమక్రమేణ అతను ఉన్నతవిద్యలో ఉత్తీర్ణుడైనాడు. మంచివక్తగా అతను పేరుప్రఖ్యాతులు గడించాడు. అతని ఉపన్యాసం వినటానికి వేలాది మంది ప్రోగయ్యేవారు.

ఒక పర్యాయం ప్రక్క గ్రామంలోని కాలేజికి వచ్చి ఉపన్యాసం ఇవ్వవలసిందిగా విద్యాసాగర్‌కి ఆహ్వానం వచ్చింది. ఒక చిన్న బ్యాగు పట్టుకొని రైలులో బయల్దేరాడు. అతనెక్కిన కంపార్టుమెంటులోనే ఒక ఐ.సి.ఎస్. ఆఫీసర్ కూడా ప్రయాణిస్తున్నాడు. అతను విద్యాసాగర్‌యొక్క ఉపన్యాసాన్ని వినటానికే వెళుతున్నాడు. అయితే అంతకుపూర్వం విద్యాసాగర్‌ని చూసియుండక పోవటంచేత అతనిని గుర్తు పట్టలేదు. ఇద్దరూ ట్రైను దిగారు. దిగుతూనే ఈ ఆఫీసర్ కూలిమనిషికోసం వెతకనారంభించాడు. అది చూసి విద్యాసాగర్ అతని పెట్టెను తాను మోసుకువస్తానన్నాడు. అతను విద్యాసాగర్‌ని చూసి ఇతనెవరో కూలిమనిషి అని భావించి, తన పెట్టెను అతని చేతికిచ్చాడు. విద్యాసాగర్ తనకు సేవచేసే అవకాశం లభించింది కదా అని ఆనందించాడు. ఎక్కడికి వెళ్ళాలని ఆ ఆఫీసర్‌ని అడిగాడు. తాను విద్యాసాగర్ ఉపన్యాసం వినటంకోసం వచ్చానని, తనను ఫలానాచోటికి తీసుకువెళ్ళవలసిందని అతను చెప్పాడు. విద్యాసాగర్ తనలో తాను నవ్వుకొని, అతను చెప్పినచోటికి పెట్టెను మోసుకువెళ్ళాడు. అతను విద్యాసాగర్‌కి కొంత డబ్బివ్వబోయాడు. అప్పుడు విద్యాసాగర్ "అయ్యా! నేను మీకు సహాయం చేయాలని వచ్చానేగాని, కూలికోసం రాలేదు. మన్నించండి నాకీ డబ్బు అక్కర్లేదు" అని పలికి అక్కడనుండి వెళ్ళిపోయాడు.

సభ ప్రారంభం కానున్నది. అందరూ విద్యాసాగర్ రాకకోసం కాచుకొని ఉన్నారు. వారిలో ఈ ఐ.సి.ఎస్. ఆఫీసర్ కూడా ఉన్నాడు. విద్యాసాగర్ వస్తూనే అతనికి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎంతో నిరాడంబరంగా ఉన్న విద్యాసాగర్‌ని చూసి ఈ ఆఫీసరు ఆశ్చర్యపోయాడు. "అరె, నా పెట్టెను మోసుకొని వచ్చింది ఇతనే కదా! గొప్ప విద్యావంతుడైనప్పటికీ ఇతనెంతటి నిగర్వి!" అని అనుకున్నాడు; తాను చేసిన పనికి పశ్చాత్తాపపడ్డాడు.

గర్వంతో విఱ్ఱవీగేవానిని కట్టుకున్న భార్య, కన్నకుమారుడు కూడా గౌరవించరు. విద్యాసాగర్‌లో ఏమాత్రం గర్వం లేదు. అతను వేదికపైకి వెళ్ళి శ్రోతల హృదయాలకు హత్తుకొనే

రీతిలో ఉపన్యసించాడు. కేవలం స్టోరీలు చెబుతూపోలేదు; గ్రంథాలలోని విషయాలను వివరించలేదు; నిత్య జీవితంలో తన అనుభూతిని ఆధారంగా చేసుకొని ప్రసంగించాడు. అందుచేత అతని ఉపన్యాసం అందరినీ ఆకర్షించింది. విద్యాసాగర్‌వంటి మహనీయులు ఈనాటికీ భారతదేశంలో ఎందరో ఉన్నారు. భారతదేశం చాలా పవిత్రమైనది.

**పరమ పావనమైన భారతావనియందు**
**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నిటియందు వన్నెగాంచినయట్టి**
**ఘన సత్యశీలమే కఠిన తపము**
**మధుర భావంబేది మన దేశమందన్న**
**మాతృభావముకంటె మాన్యమెద్ది?**
**ప్రాణంబుకంటెను మానంబె ఘనమను**
**మన దేశ నీతిని మంట గలిపి**

**నేటి కిచ్చిరి పరదేశ నీతులరసి**
**వెన విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తె**
**ఔర! ఏమందు భారత పాలనంబు**
**ఏనుగెట్టుల తన బలమెఱుగ లేదొ**
**అట్టులైనారు భారత ప్రజలు నేడు!**

ఎంత పవిత్రమైనదీ భారతదేశం! అలాంటి దేశం ఈనాడు కష్టాల ననుభవిస్తున్నదంటే కారణమేమిటి? భారతీయ సంస్కృతిని భారతీయులే సరిగా అర్థం చేసుకోలేకపోవటం, ఆచరణలో పెట్టకపోవటమే దీనికి కారణం. విద్యార్థులారా! విద్యార్థినులారా! పవిత్రమైన మన భారతదేశ చరిత్రను, ఆధ్యాత్మిక సంపత్తిని ఒక్కసారి మననం చేసుకోండి. మీరు అందరికీ ఉపకారం చేయలేకపోయినప్పటికీ ఏ కొందరికైనా ఉపకారం చేసి ఆనందాన్ని పొందండి.

**“మొదలు అమ్మకు...”**

పూర్వం రంగూన్ యుద్ధంలో తమవారినందరినీ కోల్పోయి ఒక తల్లి, ఆమె కుమారుడు

srisathyasaivachanamrutam

మద్రాసుకు చేరుకున్నారు. కుమారుడు చిన్న పిల్లవాడు. వానికి ఆకలైంది. "నాయనా! ఈ చెట్టు క్రింద కూర్చో" అని చెప్పి ఆ తల్లి ఇంటింటికీ పోయి ఇంత భిక్షమెత్తి తెచ్చింది. తన బిడ్డ తిన్న తరువాత తాను కూడా భుజించింది. కాని, ప్రతి రోజూ ఎవరు పెడతారు? ఒక్కొక్కరోజున ఆమెకు ఏమీ లభించేది కాదు. ఏదోవిధంగా కొద్ది ఆహారాన్ని సంపాదించి, కుమారునికి పెట్టి తాను పస్తుండేది. ఈవిధంగా కొన్ని రోజులు గడిచేటప్పటికి క్రమక్రమేణ ఆమె ఆరోగ్యం క్షీణించిపోయింది. ఒకనాడు కుమారుడు "అమ్మా! నీవు చాలా బలహీనంగా ఉన్నావు. కాబట్టి విశ్రాంతి తీసుకో. ఈరోజు నేను వెళ్ళి భిక్షమెత్తుతాను" అన్నాడు. తల్లి ఒప్పుకోలేదు. కొడుకు భిక్షమెత్తుతానంటే ఏ తల్లి అంగీకరిస్తుంది? కాని ఈ పిల్లవాడు బలవంతం మీద తల్లిని కూర్చోబెట్టి తాను భిక్షాటనకు బయల్దేరాడు. తనకు చిక్కిన కొద్దిపాటి ఆహారాన్ని తల్లికి పెట్టాడు. తాను ముందే తిన్నానని అబద్ధం చెప్పాడు. ఈవిధంగా కొన్ని రోజులు గడిచేటప్పటికి అతను కూడా చాలా నీరసించిపోయాడు; పాపం మాట్లాడటానికి కూడా శక్తి లేకపోయింది.

ఒక రోజున ఒక ఇంటి ముందుకు వెళ్ళి "అయ్యా, ఆకలి, ఆకలి..." అన్నాడు దీనంగా. అదొక ఆఫీసరు ఇల్లు. ఆయన వరండాలో ఈజీఛైర్‌పై కూర్చుని న్యూస్‌పేపరు చదువుకుంటున్నాడు. ఈ పిల్లవాణ్ణి చూసి జాలిపడి లోపలికి వెళ్ళి ఆకులో అన్నం పెట్టి తీసుకువచ్చి, అక్కడే కూర్చుని తినమన్నాడు. కాని, ఆ పిల్లవాడు ఇంటికి తీసుకువెళతానన్నాడు. "ఆకలంటున్నావు. ఇక్కడే ఎందుకు తినకూడదు?" అన్నాడు ఆఫీసరు. ఇంతలో ఆ పిల్లవాడు నీరసంతో కళ్ళు తిరిగి క్రిందపడిపోయాడు. ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తుంటే, ఆ ఆఫీసరు అతని నోటిదగ్గర చెవి పెట్టి విన్నాడు. ఆ పిల్లవాడు "మొదలు అమ్మకు, మొదలు అమ్మకు..." అంటూ ప్రాణం విడిచాడు. అలాంటి గుణవంతులైన పిల్లలు ఈనాటికీ ఉన్నారు మనభారతదేశంలో.

విద్యార్థినీ విద్యార్థులారా! మొట్టమొదట మీరు దయను పెంచుకోండి. కష్టాలలో ఉన్నవారిని ఆదుకోండి. మీ జేబులో పది రూపాయలుంటే, కనీసం ఒక రూపాయినైనా దానం చేయండి. త్యాగంద్వారానే అమృతత్వం సిద్ధిస్తుందని మన భారతీయసంస్కృతి బోధిస్తోంది. "హస్తస్య భూషణం దానం, సత్యం కంఠస్య భూషణం." హస్తమునకు దానమే భూషణం, కంఠమునకు

sri sathyasai vahini vachanamrutam

సత్యమే భూషణం. ఇలాంటి విలువైన భూషణాలుండగా ఇతర భూషణాలను ఆశించటమెందుకు? మీరు దయామయులై, చదివిన చదువుకు తగిన త్యాగ నిరతిని పోషించుకొని సమాజంలో మంచిపేరును సంపాదించండి. క్రోధము, అహంకారమువంటి దుర్గుణాలను దూరం నెట్టండి. దుర్గుణాలను లోపల ఉంచుకొని ఎంత గొప్ప దానం చేసినా ఫలితం శూన్యం. ప్రేమను పెంచుకొని పదిమందికి ఆనందాన్ని పంచండి. ఇదే చదువులో ఉన్న అంతరార్థం. నిజంగా మీరు దేశానికి చేయవలసిన సేవ ఇదే. మీరు గొప్ప భవనాలు, స్కూళ్ళు నిర్మించనక్కర్లేదు. మీ శక్తిమేరకు సేవ చేయండి. ఏది చేసినా ప్రేమతో చేయండి. ప్రేమను మించిన ధనం లేదు.

**(22.11.2001 మధ్యాహ్నం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vachanamrutam